క్లుప్తంగా

ప్రజా సమస్యలు పరిష్కరించండి

చీరాల టౌన్: ప్రజలకు ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది అలసత్వం వహించకుండా నిబద్ధతతో పనిచేయాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలోని సమావేశపు హాలులో రెవెన్యూ ఉద్యోగులతో తహసీల్దార్ సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని రెవెన్యూ గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరగా విచారణలు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి జవాబుదారీగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం అందించే రెవెన్యూ సేవలను అందరికీ అందించాలన్నారు. భూసమస్యల అర్జీల విచారణ నిష్పక్షపాతంగా చేయాలన్నారు. వీఆర్వోలు వారికి కేటాయించిన గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సేవలను అందించాలన్నారు. భూములకు సంబంధించిన రికార్డులు విధిగా ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలని కోరారు. సమావేశంలో డీటీ సుశీల, మండల సర్వేయర్ బసవాచారి, ఆర్ఐలు శేఖర్, సత్యం, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో గాలికుంటు చెక్

- పశువులకు వ్యాక్సినేషన్ తప్పనిసరి అంటున్న వైద్యులు

అద్దంకి: వ్యవసాయం తర్వాత పల్లె జనం ఎక్కువగా ఆధార పడేది పాడి పశువులపైనే. వాటి ద్వారా వచ్చే పాలు.. ఇతర ఉత్పత్తులు అమ్ముకుంటూ జీవనం సాగించేవారు అద్దంకి నియోజకవర్గంలో అధికంగా ఉన్నారు. అయితే పశువులకు పలు రకాల వ్యాధులు సంక్రమిస్తుంటాయి. వాటి సమస్యలు పశుపోషకులే గుర్తించి వైద్యుల ద్వారా చికిత్స అందించాల్సి ఉంటుంది. ముఖ్యంగా పశువులకు వచ్చే వ్యాధుల్లో ప్రమాదకరమైనది గాలికుంటు. ఈ వ్యాధి నివారణ కోసం పశు సంవర్థక శాఖ ద్వారా ప్రతి సంవత్సరం ఉచితంగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. దానిలో భాగంగా నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పశు సంవర్థక శాఖ ద్వారా వ్యాక్సినేషన్ కార్యక్రమాలు నిరాటంకంగా నిర్వహి స్తూ వేలాది మూగ జీవాలను రక్షించేందుకు సిద్ధంగా ఉంటుంది.

గాలికుంటు వ్యాధి లక్షణాలు

గాలికుంటు వ్యాధి సోకిన పశువులు తీవ్రమైన జ్వరం, నీరసం ఉంటుంది. నోటి నుంచి సొంగ కార్చడంతో పాటు నోరు.. కాలి గిట్టలు మధ్య పుండ్లు పడతాయి. కొద్ది ఎండకు సైతం అవి తట్టుకోలేవు. చూడి పశువులు ఈసుకుపోవడం (గర్భం పోవడం) వంటి లక్షణాలు గమనించవచ్చు. ముఖ్యంగా పాడిపశువుల్లో అయితే పాలు ఇవ్వకపోవడంతో పూర్తిగా శక్తి కోల్పోవడం జరుగుతుంది. సరైన సమయంలో చికిత్స చేయనట్లైతే నోరు పుండు, కాలి గాయాలతో ఆహారం తీసుకోలేక నీరసించి చనిపోవచ్చు. గాలి కుంటుకు టీకాలే నివారణ మార్గం. మరో మార్గం లేదు. నాలుగు నెలలు మించిన పశువులకు అన్నింటికీ టీకాలు వేయించుకోవాలి. టీకాలతో వ్యాధి రాకండా చేసుకోవచ్చు.


కాళ్ల గిట్టల మధ్య ఏర్పడిన పుండు


పశువుకు నోటిలో వస్తున్న సొంగ

వ్యాక్సినేషన్ సద్వినియోగం చేసుకోండి

గాలి కుంటు వ్యాధికి వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రతి ఏడాది జరుగుతుంది. ప్రతి పాడి రైతు తమ పశువులకు గాలికుంటు వ్యాక్సిన్ వేయించుకుని పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా జాగ్రత్త పడాలి. అద్దంకి ఏరియా పరిధిలోని అద్దంకి, కొరిశపాడు మండలాల్లో వ్యాక్సినేషన్ షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో టీకాలు వేస్తాం.

– బ్రహ్మయ్య, ఏడీ, అద్దంకి

విద్యార్థులకు చేతి వృత్తులపై అవగాహన

జె.పంగులూరు: మండల పరిధిలోని కొండమంజులూరు శ్రీ రావుల జానకి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చేతి వృత్తులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఏపీ సమగ్రశిక్షణ ఆధ్వర్యంలో దసరా సెలవులలో ఒకేషనల్ ఇంటర్ షిప్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఈ నెల 29 నుంచి అక్టోబర్ 01వ తేదీ వరకు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం అనిత తెలిపారు. ట్రైనర్ జీ. రవిచంద్ర.. ఎస్ఏఆర్ ఆటో మొబైల్ షాపునకు తీసుకువెళ్లి టూవీలర్ భాగాల గురించి, పరికరాలు, రిపేర్లు చేసే విధానంపై అవగాహన కల్పించారు. రిటైల్ ట్రేడింగ్ ట్రైనర్ సీహెచ్ గంగా భవానీ ప్రసాద్, స్థానిక జీఎస్ఆర్ జనరల్ స్టోర్, రాజారావు టెక్స్‌టైల్, నాగమ్మ జనరల్ స్టోర్‌లో విద్యార్థులకు ఉత్పత్తులపై, వ్యాపారం చేసే విధానంపై అవగాహన కల్పించారు. స్వయం ఉపాధి అవకాశాలు ద్వారా ఇంకొంత మందికి చేయూత ఇవ్వాలని హెచ్ఎం అనిత తెలిపారు. కార్యక్రమానికి సహకరిస్తున్న మెకానిక్, షాపు యజమానులకు ధన్యావాదాలు తెలిపారు.


జనరల్ స్టోర్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

29న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చీరాల అర్బన్: చీరాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో చైర్మన్ మించాల సాంబశివరావు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అబ్దుల్ రషీద్ శుక్రవారం తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు పంచాయతీలో గ్రామ సభ

చినగంజాం: భూముల రీ సర్వేలో భాగంగా శనివారం చినగంజాం పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు తెలిపారు. సోపిరాల, మున్నంవారి పాలెం, రాజుబంగారు పాలెం, కొత్తపాలెం, పల్లెపాలెం రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: భారతీయ జనతాపార్టీ, ఎస్ఆర్‌పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో సేవా పఖ్వాడ నషా ముక్త్ భారత్‌లో భాగంగా మత్తు పదార్థాల నిర్మూలన అవగాహన ర్యాలీ శుక్రవారం పట్టణంలో నిర్వహించారు. హైస్కూల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నినాదాలు చేశారు. విదేశాల నుంచి డ్రగ్స్‌ను ఓడల ద్వారా దిగుమతి చేస్తున్నారన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, ఒడిస్సాలో ఎక్కువగా గంజాయి సాగు చేస్తూ రైళ్ల ద్వారా తరలిస్తున్నారన్నారు. చీరాలలో కూడా వ్యసనాల విముక్తి కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలు స్కూల్‌కు వెళ్లి ఏం చేస్తున్నారో విచారణ చేయాలన్నారు. బి.హేమంత్‌కుమార్, జి.భవాని, కె.బంగారుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులు పెరిగేలా కృషి చేయాలి

పర్చూరు(చినగంజాం): సర్పంచ్‌లు, కార్యదర్శులు ఆదాయ వనరుల పెంపునకు కృషి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకట స్వామి తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ సమావేశ భవనంలో గ్రామ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు వన్ రిసోర్స్ సర్వేపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మాట్లాడుతూ గతంతో పోలిస్తే గ్రామ పంచాయతీల ఖర్చులు పెరిగాయని, ఖర్చులకు తగిన ఆదాయం రావడం లేదన్నారు. పంచాయతీల్లో ఖర్చులన్నీ ఇంటి పన్ను వసూలుపైన ఆధారపడుతున్నారన్నారు. సాధ్యమైనంత వరకు గ్రామాల్లోని ఆదాయ వనరులను గుర్తించాలని వాటి ద్వారా ఆదాయం ఎలా పెంచాలో ప్రణాళికలు తయారు చేసుకోవాలని కోరారు. ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించాలన్నారు. గ్రామ పంచాయతీలకు వచ్చే ఫండ్‌ను ఖర్చు చేసేటప్పుడు కూజా జవాబుదారీతనం ఉండాలని కోరారు. గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్, కార్యదర్శి సమన్వయంతో పని చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ కె. సత్యనారాయణ, గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీఓ


ఇంకొల్లు: అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ


చినగంజాం: ర్యాలీలో సర్పంచ్‌లు, కార్యదర్శులు

చినగంజాం: పంచాయతీలు సొంత ఆదాయ వనరులను మెరుగు పరచుకోవాలని ఎంపీడీఓ కె. ధనలక్ష్మి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయిలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేవలం పన్నులపై ఆధారపడకుండా ఇతర వనరులను గుర్తించి ఆదాయాన్ని పెంచాలని సూచించారు.

ఇంకొల్లు(చినగంజాం): పంచాయతీలు సొంత ఆదాయ మార్గాలను అన్వేషించుకోవాలని ఎంపీడీఓ జి. శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వన్ సోర్స్ రెవెన్యూపై సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఇతర సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీలు వివిధ పన్నుల ద్వారా సొంత ఆదాయాన్ని ఏ విధంగా సంపాదించాలో తెలియజేశారు. మాస్టర్ ట్రైనర్ సూర్యనారాయణ, వి. శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించండి

చీరాల టౌన్: పొదుపు గ్రూపులు రుణాల చెల్లింపులు సకాలంలో చెల్లించేలా వీఓఏలు చర్యలు తీసుకోవాలని ఏపీఎం మధుసూధనరావు సూచించారు. శుక్రవారం బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవన్‌లో మండలంలోని వీఓఏలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏపీఎం సుబ్బారావు మాట్లాడుతూ మండలంలో ఉన్న పొదుపు గ్రూపుల వద్దకు వీఓఏలు నెలకు ఒకసారి సమావేశాన్ని నిర్వహించి గ్రూపుల ప్రగతి తెలుసుకోవాలన్నారు. పొదుపు గ్రూపులు తీసుకున్న రుణాలు, ఏర్పాటు చేసుకున్న స్వయం సహాయక సంస్థలు, వ్యాపారాలను వీఓఏలు పరిశీలించి పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సంఘాల పుస్తకాలను విధిగా రాయడంతో పాటు సీఐఎఫ్, స్త్రీనిధి, సబ్ ప్లాన్ రుణాలు వందశాతం సక్రమంగా చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రుణం వాయిదాలు పూర్తి అయిన గ్రూపులకు అదనపు మొత్తంతో రుణం అందించాలన్నారు. వీఓఏలు పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో సీసీలు, వీఏవోలున్నారు.

బీమా పథకాలు వరం


బల్లికురవలో చెక్ అందజేస్తున్న చీఫ్ మేనేజర్

బల్లికురవ: బ్యాంకులో ఖాతాలున్న ప్రతి ఒక్కరూ బీమా పథకాలకు ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాలని, బల్లికకురవ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చీఫ్ మేనేజర్ షేక్ శీనా నాయక్ కోరారు. ముక్తేశ్వరం గ్రామానికి చెందిన ఎం. వెంకట మల్లిఖార్జున ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజనలో చేరి ఇటీవలే చనిపోయాడు. శుక్రవారం నామిని అయిన తండ్రి రామసుబ్బయ్యకు రూ. 2 లక్షల చెక్కు అందజేశారు. బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్లు బిందుమాధవి, సుఖితా గ్రేస్ పాల్గొన్నారు.


భావన్నారాయణ స్వామికి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం


చినగంజాం: గ్రామోత్సవంలో కోలాటం ప్రదర్శిస్తున్న మహిళా బృందం


పర్చూరు: శ్రీమహాలక్ష్మీదేవి అవతారంలో అమ్మవారు

మహాలక్ష్మీ కాపాడవమ్మా!

బల్లికురవ: దసరా శరన్నవరాత్రులు మండలంలో వాడవాడలా ఘనంగా నిర్వహిస్తున్నారు. 5వ రోజు శుక్రవారం ఆలయాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల వద్ద అమ్మవార్లను మహాలక్ష్మీ దేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. చెన్నుపల్లి, కొండాయపాలెం, కొణిదెన, నక్కబొక్కలపాడు, బల్లికురవ, చిన అంబడిపూడి, కొప్పరపాడు గ్రామాల్లో అలంకరణలతో పాటు, రాత్రిళ్లు భజనలు చేపడుతున్నారు. కొణిదెన బ్రహ్మకుండం వద్ద నవరాత్రి వేడుకల్లో భాగంగా ప్రతిరోజూ అన్నసంతర్పణ చేపడుతున్నారు.

వేటపాలెం: పలు దేవస్థానాల్లో దసరా నవరాత్రోత్సవాలు ఐదో రోజు శుక్రవారం వైభవంగా జరిగాయి. స్థానిక కన్యకాపర మేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని మహాలక్ష్మమ్మగా అలంకరించారు. హారతులసేవ నిర్వహించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో గల వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని గజవాహనంపై ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి కుంకమ పూజలు చేశారు. అనంతరం హారతులసేవ నిర్వహించారు. చిన్నారుల ప్రదర్శించిన కోలాటం ఆహుతులను అలరింప జేశాయి. రావూరిపేట శివారులో పంట పొలాల్లో వేంచేసియున్న కనకన నాగవరపమ్మ అమ్మవారిని సరస్వతి దేవిగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.

యద్దనపూడి: దసర శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం ఐదో రోజు అమ్మవారు అష్టైశ్వర్యాలు ప్రసాదించే మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఇరువైపులా గజరాజులు సేవిస్తుండగా చతుర్భుజాలతో ఒక హస్తం అభయముద్రతో, రెండు హస్తాలతో కమలాలతో, ఒకహస్తంతో కనకదార కురిపిస్తూ తన దివ్య మంగళ స్వరూపంతో భక్తులకు దర్శనమిచ్చారు. లోకస్థితి కారిణిగా ధన, ధాన్య, ధైర్య, విజయ, విద్యా, సౌభాగ్య, సంతాన గజలక్ష్ములుగా, వరాలు ప్రసాదించే అష్టలక్ష్ములను దర్శించటం వల్ల ఐశ్వర్యప్రాప్తి కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి కుంకుమార్చనలు, శ్రీచక్ర పూజలు, అష్టలక్ష్మిస్తోత్రం, కనకదారస్తోత్రం పారాయణ చేశారు. మండలంలోని జాగర్లమూడి ఉజ్జయిని.. మహంకాళి, పూనూరు త్రిపురసుందరిదేవి, నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారు, గన్నవరం కాశీ అన్నపూర్ణాదేవి అమ్మవారి ఆలయాల్లో అమ్మవారికి విశేషపూజలు, అర్చనలు నిర్వహించారు.

చినగంజాం: స్థానిక శ్రీభూసమేత భావన్నారాయణ స్వామి ఆలయం వార్షికోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ముందుగా నిత్యహోమం, బలిహరణ నిర్వహించిన అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి గరుడోత్సవం నిర్వహించారు. వేద పండితులు పరాశరం రామాచార్యులు, ఆలయ అర్చకులు మోహనలక్ష్మీనరసింహాచార్యులు మంత్రాల నడుమ పూజాకార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం రథోత్సవ కార్యక్రమంలో స్వామి వారిని ఊరేగింపు నిర్వహించారు. గ్రామోత్సవ ఊరేగింపులో మహిళా కోలాటం బృందం మహిళలు గోవిందనామాలతో భక్తులను విశేషంగా ఆకర్షించారు.

పర్చూరు(చినగంజాం): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని నూతలపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో అమ్మవారిని శుక్రవారం శ్రీ మహాలక్ష్మీదేవి అవతారంలో అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు విశేషంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం దేవేళ్ల వీరాస్వామి ఆధ్వర్యంలో తాడేపల్లి సాయిరాం సంకీర్తనా మండలి వారిచే సంకీర్తనా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆదిపూడి మోహనకృష్ణ, వల్లభరెడ్డి శ్రీనివాసరెడ్డి, లింగంగుంట సుబ్రహ్మణ్యం, భక్తులు పాల్గొన్నారు.

జె.పంగులూరు: దేవీ నవరాత్రుల్లో భాగంగా మండల పరిధిలోని పంగులూరు భీమాలింగేశ్వర దేవాలయంలో దేవి నవరాత్రులు ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఐదో రోజు శుక్రవారం అమ్మవారు లక్ష్మీదేవి అవతారంతో భక్తులకు దర్శనం ఇచ్చారు. మండల పరిధిలోని కల్లవారిపాలెం, అలవలపాడు గ్రామాల్లో దేవి శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహించారు.

మార్టూరు: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 5వ రోజు శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులను అలరించారు. మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్టూరు శ్రీ రుక్మాబాయి సమేత పాండురంగ స్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు కను విందు చేశారు.


మల్లాయపాలెంలో మమలక్ష్మీ దేవిగా అమ్మవారు


వేటపాలెం మహాలక్ష్మీ దేవి అలంకరణలో అమ్మవారు



జాగర్లమూడిలో మహాలక్ష్మి అమ్మవారి అలంకరణ



జె.పంగులూరు: లక్ష్మీదేవిగా రూపంలో అమ్మవారు



మార్టూరులో మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు


చీరాల: సువర్ణ కిరీటధారిణిగా కన్యకాపరమేశ్వరి

పంట కోత ప్రయోగాలపై శిక్షణ


అద్దంకి: మాట్లాడుతున్న ఏడీఏ ఎఫ్రాయిం


బల్లికురవలో పంట కోతపై అవగాహన కల్పిస్తున్న ఏఓ


జె.పంగులూరు: రైతు సేవా కేంద్ర సిబ్బందితో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారెడ్డి

జె.పంగులూరు: పంట కోత ప్రయోగాలపై రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శుక్రవారం పంగులూరులోని రైతు సేవా కేంద్రంలో శిక్షణ నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి డి. సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంట కోత ప్రయోగాల వలన గ్రామాల్లో రైతాంగం సాగుచేసిన పంటల దిగుబడిపై అంచనా వస్తుందన్నారు. పంటల దిగుబడి ఎకరాకు ఎన్ని క్వింటాళ్ల పంట వస్తుందో కచ్చితంగా అంచనా వేయవచ్చన్నారు. సరాసరి దిగుబడి తక్కువ వచ్చినట్‌లైతే పంటల బీమా పొందే అవకాశం ఉంటుందన్నారు. ఏఎస్ఓ ఎన్. అనూష మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలు వ్యవసాయ రంగంలో ప్రధామైదని తెలిపారు.

అద్దంకి: పంట కోత ప్రయోగాల ద్వారా వచ్చిన అంచనాలతోనే జాతీయ స్థూల ఉత్పత్తిని లెక్కకడతారని ఏడీఏ ఎఫ్రాయిం అన్నారు. స్థానిక చిన్న శాంతయ్య పిచ్చిమ్మ గార్ల సేవా సదన్‌లో శుక్రవారం నిర్వహించిన పంట కోత ప్రయోగాల అవగాహన సదస్సులో మాట్లాడారు. మార్టూరు ఏఎస్‌వో ప్రసాద్ మాట్లాడుతూ పంట ఉత్పత్తుల ఎగుమతులు, దిగుమతులు పట కోత ప్రయోగాలపైనే ఆధారపడి ఉంటాయని చెప్పారు. అద్దంకి ఏఎస్‌వో అమర్నాథ్, గ్రామ వ్యవసాయ సహాయకులు, మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ, కొరిశపాడు మండల వ్యవసాయాధికారి రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బల్లికురవ: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట కోత, ప్రయోగాలను నిర్వహించాలని వ్యవసాయాధికారి పి. శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం బల్లికురవలో 20 రైతు సేవాకేంద్రాల్లో పని చేస్తున్న వీఏఏలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. యాప్‌లో పంట వివరాల నమోదు, కోత ప్రయోగాలపై ఉద్యానాధికారి బి. హనుమంతనాయక్, ఏఎస్‌వో ఆర్. అమర్‌నాథ్ అవగాహన కల్పించారు.